ఫంక్షన్ హాల్ నిర్వహణ అధ్వాన్నం

- 'మల్టీపర్పస్'కు మరమ్మతులు చేపట్టాలి
- సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బన్సీలాల్‌పేట్, నవంబర్ 11: బన్సీలాల్ పేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ జీహెచ్‌ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్వహణ అధ్వాన్నంగా మారిందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సోమవారం ఆయన కార్పొరేటర్ కె.హేమలతతో కలిసి ఫంక్షన్ హాల్‌ను సందర్శించారు. హాల్‌లో లైట్లు వెలగడం లేదని, ఫ్యాన్లు పనిచేయడం లేదని, టాయిలెట్ల నుంచి దుర్వాసన వస్తున్నదని స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన జీహెచ్‌ఎంసీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలిసారిగా బన్సీలాల్‌పేట్‌లో పేదలకు తక్కువ ధరలో సకల సదుపాయాలతో కూడిన ఫంక్షన్‌హాల్ ఉండాలని నిర్మించామని చెప్పారు. ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లలో లక్షలాది రూపాయలు చెల్లించలేని పేదల స్థితిని మార్చామని ఆయన అన్నారు. అందులో తన స్వంత నిధులతో వంట సామగ్రి సమకూర్చామని, ఇప్పుడు చూస్తే అవి అన్ని మాయం కావడంతో తాము అవాక్కయ్యామని అన్నారు. హాల్ అద్దెకు తీసుకున్న ప్రజలు తమ ఇబ్బందులను వివరిస్తూ ఫిర్యాదులు చేస్తున్నారని, అధికారుల పర్యవేక్షణ లోపం, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా హాల్ నిర్మాణ లక్ష్యం నెరవేరడం లేదన్నారు. అధికారులు వెంటనే హాల్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. అంతకు ముందు ఆయన బండమైసమ్మ నగర్, డీ-క్లాస్ మార్గంలో రూ.71 లక్షలతో ఏర్పాటు చేస్తున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల్లో జాప్యం లేకుండా చూడాలని, నాణ్యతా ప్రమాణాలను పాటించి, త్వరగా రోడ్డు పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ బేగంపేట్ సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్య, ఏసీపీ సుశ్మిత, ఇంజినీర్లు సుదర్శన్, ఆంజనేయులు, జలమండలి డీజీఎం ఆశీశ్, విద్యుత్ ఏడీఈ దుర్గాప్రసాద్, డి-క్లాస్ అధ్యక్షుడు బి.మోహన్‌రావు, కార్యదర్శి రంగారావు, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వెంకటేశన్‌రాజు, కె.లక్ష్మిపతి, ప్రేమ్‌కుమార్, విజయ్‌శంకర్, జ్ఞాని, అబ్బాస్, ఫహీమ్, నాగభూషణం, కుశల్, రాజేందర్ పాల్గొన్నారు.

బన్సీలాల్‌పేట్ మల్టీపర్పస్ హాల్‌లో డీసీ సమ్మయ్యతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

నర్సింగ్ కళాశాల సమస్యల పరిష్కారానికి కృషి

బోయిగూడలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవనంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. టీజీఎంఎస్ఐడీసీ డీఈఈ అనిల్, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, అధ్యాపకులతో ఆయన మాట్లాడారు. కొన్ని రోజులుగా డ్రైనేజీ పైప్‌లైన్లు బ్లాక్ కావడంతో విద్యార్థులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని, 1978లో నిర్మించిన పాత భవనంలోని డ్రైనేజీ వ్యవస్థ శిథిలావస్థకు చేరిందని వారు వివరించారు. ఒకే భవనంలో నర్సింగ్ కళాశాల, స్కూల్ నడుస్తున్నాయని, హాస్టల్ కూడా ఉన్నందున 400 మంది నీటి వాడకం ఎక్కువగా ఉన్నదని చెప్పారు. రెండు వైపులా ఫంక్షన్ హాళ్లు ఉండడం వల్ల తమ భవనానికి చెందిన మ్యాన్‌హోళ్లు తరచుగా నిండిపోతున్నాయని తెలిపారు. స్పందించిన ఆయన మాట్లాడుతూ ఏ సమస్యలున్నాయో లిఖితపూర్వకంగా ఇస్తే, ప్రతిపాదనలు రూపొందించాక, తాను ప్రభుత్వంతో మాట్లాడి అవసరమైన నిధుల మంజూరు త్వరగా జరిగేలా సహకరిస్తానని అన్నారు.

ఆలయాల భద్రతపై దృష్టి సారించాలి : ఏసీపీ

మారేడ్‌పల్లి, నవంబర్ 11: ఆలయాల భద్రత విషయంలో నిర్వాహకులు ప్రత్యేక దృష్టిని సారించాలని గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య అన్నారు. సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ ఆలయ ఘటనను దృష్టిలో ఉంచుకొని నగర పోలీసు కమిషనర్, నార్త్ జోన్ డీసీపీ ఆదేశాల మేరకు సోమవారం సికింద్రాబాద్ సప్తగిరి హోటల్‌లో గోపాలపురం, మారేడ్‌పల్లి, తుకారంగేట్ పోలీసు స్టేషన్ల పరిధిలోని ఆలయ నిర్వాహకులతో కలిసి భద్రత అంశాలపై సమావేశాన్ని నిర్వహించారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు ప్రధాన అంశాలపై చర్చించారు. గోపాలపురం ఏసీపీ మాట్లాడుతూ ఆలయాల వద్ద నిత్యం పోలీసుల పర్యవేక్షణ ఉంటుందని, ఆలయాల నిర్వాహకులు సెక్యూరిటీని ఏర్పాటు చేసుకోవాలన్నారు. రాత్రి సమయంలో గుర్తుతెలియని వారిని ఆలయాల వద్ద నిద్రించేందుకు అనుమతి ఇవ్వొద్దన్నారు. కార్యక్రమంలో గోపాలపురం, మారేడ్‌పల్లి ఇన్‌స్పెక్టర్లు నరేశ్, నోముల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు భద్రత కట్టుదిట్టం చేయాలి

అడ్డగుట్ట, నవంబర్ 11: తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆలయాలపై దాడులు జరగకుండా ముందస్తుగా కట్టుదిట్టమైన చర్యలను తీసుకోవాలని తుకారాంగేట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌ను హనుమాన్ భక్త సేవాసమితి నిర్వాహకులు, వివిధ ఆలయాల కమిటీ సభ్యులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఆలయాలపై వరుస దాడులు జరుగుతున్న నేపథ్యంలో ముందస్తు చర్యలను తీసుకోవాలని వారు సీఐని కోరారు. పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేసి, పెట్రోలింగ్ పెంచాలని కోరారు. కార్యక్రమంలో సమితి నిర్వాహకులు, వివిధ ఆలయాల ప్రతినిధులు గెల్లు ఉదయ్‌యాదవ్, రాగుల రాజు, శివాజీ, నర్సింగ్, విజయ్‌కుమార్, చింటూ, సంతోష్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

కులగణన సక్రమంగా నిర్వహించాలి

బన్సీలాల్‌పేట్‌లో మీడియాతో మాట్లాడుతున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని

బన్సీలాల్‌పేట్, నవంబర్ 11: కులగణన సక్రమంగా లేకపోవడంతో ప్రభుత్వం ప్రజల విమర్శలను ఎదుర్కొంటూ అభాసుపాలవుతున్నదని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సోమవారం బన్సీలాల్‌పేట్‌లో ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. కులాల వారిగా జనాభా లెక్కించేందుకు 75 ప్రశ్నలు ఎందుకని ఆయన ప్రశ్నించారు. సర్వేలో అడుగుతున్న ప్రశ్నలను చూసి ప్రజలు అవాక్కవుతున్నారని, వాటికి సమాధానం కూడా చెప్పలేకపోతున్నారన్నారు. ఒక వైపు ఎన్యూమరేటర్లకు, మరోవైపు సామాన్య ప్రజలు అవస్థలు పడుతున్నారని అన్నారు. సర్వే వల్ల ఎలాంటి ఉపయోగం లేదని, కేవలం ప్రభుత్వం కాలయాపన చేయడానికే సర్వే చేపట్టిందని స్పష్టమవుతున్నదన్నారు. సర్వే పూర్తి కాకుండా, త్వరలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగనున్న సమయంలో బీసీలకు ఇవ్వాల్సిన 42 శాతం రిజర్వేషన్ గురించి ప్రభుత్వం స్పష్టత లేకుండా ఎందుకు ప్రకటనలు చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఇప్పుడు బీసీలు చైతన్యవంతమయ్యారని, వారిని మభ్యపెట్టడానికి చేపడుతున్న సర్వేకు సమాధానాలు చెప్పడానికి నిరాకరించి, వ్యతిరేకిస్తున్నారని అన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో కేవలం ఒక్కరోజులోనే సమగ్ర సర్వే విజయవంతంగా పూర్తి చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

భారత విప్లవోద్యమ నేత చంద్ర పుల్లారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ జానకిరెడ్డి

చిక్కడపల్లి, నవంబర్ 11: గోదావరిలోయ రైతాంగ ప్రతిఘటన పోరాట నిర్మాత, భారత విప్లవోద్యమ నేత కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి అని ప్రొఫెసర్ అరుట్ల జానకిరెడ్డి అన్నారు. సీపీఐ(ఎంఎల్) రాంచంద్రన్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గోదావరిలోయ రైతాంగ ప్రతిఘటన పోరాట నిర్మాత చంద్ర పుల్లారెడ్డి 40వ వర్ధంతిని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ జానకిరెడ్డి మాట్లాడుతూ దోపిడీ, పీడన లేని సమ సమాజం కోసం నిజమైన స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు సిద్ధించాలనే లక్ష్యంతో ఎంతో మంది విప్లవీరులు తమ అమూల్యమైన ప్రాణాలు తృణపాయంగా అర్పించారని అన్నారు. సమావేశంలో సీపీఐ(ఎంఎల్) రాంచంద్రన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి ఎల్లుట్ల ఉపేందర్, నాయకులు చామకూరి నర్సయ్య, అబ్దుల్ కరీం, భాను ప్రసాద్, మధు, మల్లేశ్, సతీశ్ పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి ఆలయంలో కార్తిక పూజలు

శివలింగానికి అభిషేకం చేస్తున్న అర్చకులు

చిక్కడపల్లి, నవంబర్ 11: నగరంలో ప్రసిద్ధి గాంచిన లక్ష్మీగణపతి దేవస్థానంలో కార్తికమాసం సందర్భంగా సోమవారం పూజలు నిర్వహించారు. రుద్రాభిషేకం, ఆకాశదీప పూజ, కార్తిక పురాణ ప్రవచనం కార్యక్రమాలు జరిగాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లక్ష్మారెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామూహిక దీపారాధన కార్యక్రమాలు వైభవంగా జరుగుతున్నాయని తెలిపారు. భక్తులకు వత్తులు, ప్రమిదలు, నూనె అందజేస్తున్నట్టు చెప్పారు.

ఉమామహేశ్వర ఆలయంలో లక్ష దీపోత్సవం

కంటోన్మెంట్, నవంబర్ 11: న్యూ బోయిన్‌పల్లి పెద్దతోకట్ట ఉమామహేశ్వర ఆలయంలో కార్తిక మాసం పురస్కరించుకొని లక్ష దీపోత్సవం నిర్వహించారు. శివుడికి పూజలు చేశారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరగా, వారంలో ఏర్పాటు చేస్తానని జంపన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు ముప్పిడి మధుకర్, వీఆర్ హాస్పిటల్ ఎండీ నందకిషోర్, ముకేశ్‌యాదవ్, స్థానిక మహిళలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

14న కర్ణాటక సంగీత ఉత్సవం

ఉస్మానియా యూనివర్సిటీ,నవంబర్ 11: ఓయూ క్యాంపస్‌లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ(డీడీఎంఎస్) కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అండ్ మీడియా ఎడ్యుకేషన్ (కోఫేమ్) ఆధ్వర్యంలో ఈనెల 14న కర్ణాటక సంగీత ఉత్సవం నిర్వహించనున్నట్టు కళాశాల చైర్‌పర్సన్ డాక్టర్ వై.రమాప్రభ, ప్రిన్సిపాల్ కె.విజయ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ సంగీత విద్వాంసులు,సంగీత కళానిధి, చిత్రవీణ డాక్టర్ ఎన్.రవికిరణ్, పద్మశ్రీ డాక్టర్ ఎల్లా వెంకటేశ్వరరావుతో ఈ ఉత్సవం నిర్వహించనున్నట్టు వివరించారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి : ఎమ్మెల్యే

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, నవంబర్ 10: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, ఆట పాటల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. దోమలగూడలోని భారత్ స్కౌట్స్ గైడ్స్ డైమండ్ జూబ్లీ వేడుకలు సోమవారం ముగిశాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్ స్కౌట్స్ గైడ్స్ వేలాది మందిని సంస్కారవంతులుగా తీర్చిదిద్దుతుందని అన్నారు. కార్యక్రమంలో కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ, భారత్ స్కౌట్స్ గైడ్స్ కోశాధికారి రాజ్‌గోపాల్, కార్యదర్శి సీజే అరుణ్‌కుమార్, పరమేశ్వర్, జాన్ సమ్యూల్, మీడియా ఇన్‌చార్జి సంజీవరావ్, బీఆర్‌ఎస్ నాయకులు వల్లాల శ్యామ్‌యాదవ్, ముచ్చకుర్తి ప్రభాకర్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలి

బేగంపేట్, నవంబర్ 11: రాంగోపాల్‌పేట్ పీజీ రోడ్డు, జవహర్‌నగర్ ప్రాంతాల్లో వేస్తున్న రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర అధికారులను కోరారు. సోమవారం బేగంపేట్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్, జలమండలి విభాగం అధికారులతో కలిసి పీజీ రోడ్డులో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. రాకపోకలకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారని, రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డీఈ మహేశ్, జలమండలి మేనేజర్ రామేశ్వర్, స్థానిక నాయకులు శ్రీకాంత్, కాలనీ అధ్యక్షుడు ప్రమేశ్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మాట్లాడుతున్న చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాంచందర్

చిక్కడపల్లి, నవంబర్ 11: ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఇన్‌స్పెక్టర్ వీ.రాంచందర్ అన్నారు. హైదరాబాద్ నగర్ కమిషనర్ సీవీ ఆనంద్, ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్ ఆదేశాల మేరకు సోమవారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాలలో విద్యార్థులకు 'రోడ్డు ప్రమాదాలు, నివారణ' అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపటం నేరమని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఓవర్ స్పీడ్, రాంగ్‌రూట్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ విష్ణుప్రియ, చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీరేశం,ఎస్సైలు మధు, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి కేవీలో రాష్ట్రీయ ఏక్తా పర్వ్ వేడుకలు షురూ..



బొల్లారం, నవంబర్ 11: కేంద్రీయ విద్యాలయాలు బోధనకు మాత్రమే పరిమితం కాకుండా, అన్ని కోణాల్లోనూ విద్యార్థుల మనోవికాసానికి దోహదం చేస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సర్దార్ వల్లాభాయ్ పటేల్ జయంతి సందర్భంగా సోమవారం తిరుమలగిరి కేంద్రీయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన రాష్ట్రీయ ఏక్తా పర్వ్ వేడుకలను మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరుగునున్న వేడుకలు దేశాన్ని సాంస్కృతికంగా ఏకం చేయడానికి దోహదం చేస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ కేంద్రీయ పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో కేంద్ర విద్యాశాఖ సెక్రటరీ సంజయ్‌కుమార్, కేవీ కమిషనర్ నిధి పాండే, జాయింట్ కమిషనర్ దేవకుమార్, పలు కేవీ ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గురునానక్ జయంతి

మారేడ్‌పల్లి, నవంబర్ 11: గురునానక్ 555వ జయంతి సోమవారం సికింద్రాబాద్ గురుద్వారా మందిరంలో ఘనంగా జరిగింది. నగర్ కీర్తన్ పేరుతో గురునానక్ సిక్కుల మత గ్రంథాన్ని ముస్తాబు చేసి,భారీవాహనంలో ఉంచి ఆధ్యాత్మిక గీతాలతో శోభాయాత్ర అంగరంగా వైభవంగా సాగింది. సిక్కు యువకులు చేసిన మార్షల్ ఆర్ట్స్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కమిటీ ప్రతినిధులు ప్రసాదం, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సికింద్రాబాద్, హైదరాబాద్ ప్రబంధక్ కమిటీ అధ్యక్షుడు బల్దేవ్‌సింగ్ బగ్గా, సత్వీందర్‌సింగ్ బగ్గా, జీఎస్‌ఎస్ కార్యదర్శి జగ్‌మోహన్ సింగ్, జీఎస్‌జీఎస్‌ఎస్ కార్యదర్శి జోగిందర్ సింగ్, ఇంద్రజీత్‌సింగ్, హర్‌ప్రీత్‌సింగ్ గులాటి తదితరులు పాల్గొన్నారు.

బోర్ పనులను ప్రారంభించిన కార్పొరేటర్

పవర్ బోర్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 11: బౌద్ధనగర్ డివిజన్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్టు స్థానిక కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ కంది శైలజ అన్నారు. డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పథాన తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. డివిజన్‌లోని అశోక్‌నగర్ పోచమ్మ ఆలయంలో నూతనంగా వేస్తున్న పవర్ బోర్ పనులను ఆమె సోమవారం ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, నాయకులు జగదీశ్, ఓంప్రకాశ్, పర్వతాలు, రాము, అశోక్, బాచి, వెంకటేశ్, శ్రీహరి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

బార్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

ముషీరాబాద్, నవంబర్ 11: జీహెచ్‌ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు ముషీరాబాద్ నియోజవర్గంలోని పలు బార్లపై కొరడా ఝుళిపించారు. విద్యానగర్‌లో కింగ్స్ బార్ అండ్ రెస్టారెంట్, ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని వింటేజ్ బార్, చిక్కడపల్లిలోని మదిరాయల బార్లలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. బొద్దింకలు, అపరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని గుర్తించిన అధికారులు జరిమానా విధించారు. నిబంధనలు పాటించని బార్లకు నోటీసులు జారీ చేశారు.

ఐఆర్‌టీ టెండర్లలో అక్రమాలను అరికట్టాలి

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 11: జీహెచ్‌ఎంసీ ఇన్‌స్టంట్ రిపేరింగ్ టీం (ఐఆర్‌టీ) టెండర్లలో అక్రమాలను అరికట్టాలని పలువురు కాంట్రాక్టర్లు కోరుతున్నారు. టెండర్లలో కోట్ల రూపాయల గోల్‌మాల్ జరిగిందని ఆరోపించారు. ఉన్నతాధికారులు పెద్ద కాంట్రాక్టర్లకు కొమ్ముకాస్తూ అవినీతికి తెరలేపారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నేళ్లుగా ఐఆర్‌టీ టెండర్లను సుమారు రూ.30 కోట్ల వరకు పిలిచేవారని గుర్తు చేశారు. ఇలాంటి టెండర్లలో అధికారులు పెద్ద కాంట్రాక్టర్లతో కుమ్మక్కై 150 టెండర్లకు బదులుగా కేవలం 30 టెండర్లనే పిలిచారని వాపోయారు. గతంలో వార్డు ప్రకారం పిలిచిన టెండర్లను ఇప్పుడు కేంద్రీకృతం చేశారని మండిపడ్డారు టెండర్లను పాతవిధానం ద్వారానే పిలవాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ కమిషనర్ స్పందించి, టెండర్లను వార్డు ప్రకారం పిలిచి, అవకతవకలు జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

'ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ పాత్ర కీలకం'

హిమాయత్‌నగర్, నవంబర్ 11: సాంకేతిక రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాత్ర కీలకమని బాబూ జగ్జీవన్‌రామ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన కల్పించారు. సమకాలీన ప్రపంచంలో ఏఐతోనే అనేక విషయాలు తెలుస్తున్నాయని, విద్యతోపాటు సాంకేతిక,కమ్యూనికేషన్ నైపుణ్యాలను విద్యార్థులు పెంచుకోవాలని సూచించారు. కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాపోల్ శ్రీనివాస్, ప్రతినిధులు శ్రీనివాస్‌రావు,భరద్వాజ్, సాయిమనోహర్, జనార్దన్, రాము పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ ఓవరాల్ చాంప్ 'సర్దార్' కళాశాల

మహిళలు, పురుషుల ఓవరాల్ చాంప్ సర్దార్ పటేల్ కళాశాల విజేతలతో ఓయూ రిజిస్ట్రార్ ఆన్ స్పెషల్ డ్యూటీ టు వైస్ చాన్స్‌లర్ జితేందర్‌కుమార్‌నాయక్

హైదరాబాద్, ఆట ప్రతినిధి నవంబర్ 11: ఉస్మానియా యూనివర్సిటీ అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ మహిళల ఓవరాల్ టీమ్ టైటిల్‌ను సికింద్రాబాద్ సర్దార్ పటేల్ కళాశాల సొంతం చేసుకుంది. సోమవారం జరిగిన ఫైనల్స్‌లో కళాశాల 31 పాయింట్లతో ఓవరాల్ చాంప్‌గా టైటిల్‌ను కైవసం చేసుకోగా ప్రభుత్వ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ 24 పాయింట్లతో రెండో స్థానాన్ని దక్కించుకుంది. అల్వాల్ లయోలా అకాడమీ 21 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. పురుషుల ఓవరాల్ చాంపియన్‌గా సికింద్రాబాద్ సర్దార్ పటేల్ కళాశాల, కేశవ్ మెమోరియల్ కళాశాల, అల్వాల్ లయోలా అకాడమీ మొదటి మూడు స్థానాలను సొంతం చేసుకున్నాయి. ఓయూ సింథటిక్ ట్రాక్‌లో సోమవారం ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన పురుషుల 3000 మీటర్ల ఫైనల్ పరుగులో దోమలగూడ జీసీపీఈ కళాశాల విద్యార్థి ఎస్‌కే ఆడమ్ షేఫ్ 42:1:20 సెకండ్లలో పూర్తి చేసి బంగారు పథకాన్ని సొంతం చేసుకోగా, నిజాం కళాశాల విద్యార్థి ఎన్.నరేశ్ 42:02:27 సెకండ్లలో పూర్తి చేసి రజతం, సైఫాబాద్ యూసీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఆర్.మధు 42:01:6 సెకండ్లలో పూర్తిచేసి కాంస్యం పథకాలను దక్కించుకున్నారు. మహిళల 100 మీటర్ల హర్డిల్స్ పరుగులో రితిక (బేగంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల), ఇ.శ్రీవెన్నెల (జీడీసీ కళాశాల), దీపిక టాల్ (మెదక్ డిగ్రీ కళాశాల)లు మొదటి మూడు స్థానాలను కైవసం చేసుకున్నారు. విజేతలకు ఓయూ రిజిస్ట్రార్ ఆన్ స్పెషల్ డ్యూటీ టు వైస్ చాన్స్‌లర్ జితేందర్ కుమార్ నాయక్, ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫ్యాకల్టీ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజేశ్‌కుమార్, ఓయూ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సునీల్‌కుమార్, బీఓసీ కార్యదర్శి కె.దీప్లా, సర్దార్ పటేల్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ హరినారాయణ్ తదితరులు ట్రోఫీని అందజేశారు.

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించండి

ఓయూ రిజిస్ట్రార్ నరేశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 11: ఓయూ లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఏఐఎస్‌ఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఏఐఎస్‌ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య మాట్లాడుతూ.. విద్యార్థులకు హాస్టల్, మెస్, మెయిన్ లైబ్రరీ, హెల్త్ సెంటర్లలో వసతులను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఓయూ పరిధిలో విద్యార్థులు వివిధ ప్రవేశ పరీక్షలు రాసి ప్రవేశాలు పొందారని గుర్తు చేశారు. వసతుల లేమితో వారు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రవేశం పొందిన ప్రతి విద్యార్థికి హాస్టళ్లలో నాణ్యమైన ఆహారం, వసతి కల్పించాలన్నారు. మెయిన్ లైబ్రరీలో నెలకొని ఉన్న తాగునీరు, టాయిలెట్ల సమస్యను పరిష్కరించాలని కోరారు.హెల్త్‌సెంటర్‌లో అధునాతన పరికరాలు తెప్పించడంతో పాటు వైద్య సిబ్బంది కొరతను తీర్చాలని, విద్యార్థులు, ఉద్యోగులకు హెల్త్ కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు భగత్, అశ్విన్, ప్రసాద్, రాఘవేందర్,లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి హాస్టల్ వసతి కల్పించాలి : ఏబీవీపీ

ఓయూలో పీజీ విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించేందుకు అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు అలివేలి రాజు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొండంత ఆశతో మంచి ర్యాంకులు సాధించి, సీట్లు పొందిన వారు వసతుల లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్‌లో వసతులు, రూమ్‌లు లేవని అధికారులు పోర్టల్ మూసివేయడంతో విద్యార్థులు నిరాశ చెందుతున్నారని వాపోయారు. తక్షణమే ప్రవేశం పొందిన ప్రతిఒక్కరికీ హాస్టల్, మెస్ వసతి కల్పించాలని ఆయన కోరారు.

విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్

చిక్కడపల్లి, నవంబర్ 11: విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం చిక్కడపల్లిలోని పెండేకంటి కళాశాలలో నిర్వహించిన మూట్ కోర్ట్ పోటీలకు ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ న్యాయవృత్తిలో వృద్ధి చెందాలంటే పటిష్టమైన న్యాయ శాస్త్ర సాధన అవసరమని వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ నిముషకవి వాసంతి,ఓయూ న్యాయశాస్త్ర విభాగ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ బి.విజయలక్ష్మి, వాసవి విద్యాసంస్థల జాయింట్ సెక్రటరీ ఆనంద్, కళాశాల ప్రిన్సిపాల్ అరవింద, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఈడీ రీవాల్యూయేషన్ ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 11: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షల రీవాల్యూయేషన్ ఫలితాలను విడుదల చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్టు ఆయన పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, నవంబర్ 11: టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ 11కేవీ ప్రివెంటివ్ మెడిసిన్, డీడీహెచ్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ జి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 1గంట వరకు ప్రివెంటివ్ మెడిసిన్ ఫీడర్ పధిలోని గౌరమ్మగల్లి, రాజీవ్‌గాంధీనగర్ కమ్యూనిటీహాల్, సాయిబాబా కమాన్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, నవదుర్గ మెస్, రెడ్డి కాలేజ్, హెచ్‌ఆర్డీ డిగ్రీ కాలేజ్, రత్న డిగ్రీ కాలేజ్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. మధ్యాహ్నం 2 నుంచి సాయం5 గంటల వరకు డీడీహెచ్ ఫీవర్ ఫీడర్ పరిధిలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆసుపత్రి, విజ్ఞాన్‌పురికాలనీ, వీఎస్టీ మెయిన్ రోడ్, దయానంద్‌నగర్, ఎస్‌ఆర్టీ క్వార్టర్స్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

లష్కర్‌లో...

బేగంపేట్ : విద్యుత్ లైన్లలో తలెత్తిన సాంకేతిక లోపాలు, ట్రిమ్మింగ్ కారణంగా మంగళవారం సికింద్రాబాద్ ప్యారడైజ్ ఏఈడీ పరిధిలో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేసి మరమ్మతు చేపడుతున్నట్టు ఎలక్ట్రిసిటీ అధికారులు తెలిపారు. జమిస్తాన్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం విధిస్తున్నట్టు చెప్పారు. ఎస్పీ కాలేజ్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు టీఆర్ అపార్ట్‌మెంట్, ఎల్లమ్మ టెంపుల్, స్కందగిరి ఏరియా బ్రూక్‌బాండ్ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తారు.

అదేవిధంగా ఎంసీహెచ్ పార్కు ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బాలరాం కాంపౌండ్, సంధ్య హోటల్ ఏరియా, హెరిటేజ్ ఏరియా తదితర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్టు అధికారులు తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE JUDGE, PRINCIPAL FAMILY COURT, RANGAREDDY DISTRICT, AT : L.B. NAGAR
F.C.O.P.NO. 1321 OF 2019
Between:
K Sharada ...Petitioner
And
K. Pavan Kumar ...Respondent
To
K.Pavan Kumar, S/o. K.Rama Chandra Murthy, Aged 43 years, Occ: Pvt. Employee, R/o. H.No. 2-1-105/A, Nalla Kunta, Hyderabad-500 044.
Take notice that the above-named petitioner has filed the above O.P. seeking Divorce against you Under Section 13(1) (i-a) of Hindu Marriage Act and the said case is stands posted to on 18/11/2024 for your appearance and counter if any.
Hence, you are hereby directed to appear before the above Court on 18/11/2024 at 10:30 a.m. either in person or through an Advocate, failing which the matter will be decided on merits.
(BY ORDER OF THE COURT)
J. SUGUNA RANI & K.CHOUDESWARI, Advocates
Address: 10-15-Na0001, Road No-7, Sri Sai Nagar Phase II, Badangpet, Balapur, Rangaredy-500 058,
Cell No. 7997583346, 9052553502.